క్లుప్తంగా

నేడు గోగులమ్మ తీర్థం

రంగంపేట: పెదరాయవరం గ్రామంలో కొలువైన గోగులమ్మ తల్లి వార్షిక తీర్థ మహోత్సవం బుధవారం జరగనుంది. ఈ మేరకు గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు విశేష ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. బుధవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పిస్తారు. మంగళవారం సాయంత్రం అమ్మవారి స్వరూపాలైన గరగలను గ్రామంలో ఊరేగించారు.

ఘనంగా అమ్మవార్ల తీర్థం



ప్రత్యేక అలంకరణలో గొల్లాలమ్మ, గోగులమ్మ అమ్మవార్లు

బిక్కవోలు: ఆరికరేవుల గ్రామంలోని వెలంపేట కొలువైన గొల్లాలమ్మ, గోగులమ్మ అమ్మవార్ల తీర్థం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించారు. నాళం శ్రీనివాస్, బొడ్డు వెంకట సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు గురు నాగు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

కోరకొండ: బొల్లెద్దుపాలెం గ్రామ దేవత నూకాలమ్మ జాతర ముగింపులో భాగంగా మంగళవారం అన్నసమారాధన నిర్వహించారు. దీనిలో భాగంగా బీజేపీ నాయకుడు, విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు 210 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు అలగరి వీర్రాఘవ, పూసర్ల రమేష్, మాదిసెట్టి హరిశ్చంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హోమియో వైద్యశిబిరం



శిబిరంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ వైష్ణవ్

రంగంపేట: మండల పరిధిలోని కోటపాడులో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కందర్ప వెంకట అమరనాథ్ ఆధ్వర్యంలో మంగళవారం హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన డాక్టర్ శ్యామ్‌కుమార్ వైష్ణవ్ ఈ శిబిరంలో 62 మందికి వైద్యసేవలు అందించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాంబాబు మాస్టార్, పోతుల ఈశ్వరరావు పాల్గొన్నారు.

10 వరకూ దరఖాస్తులకు అవకాశం

సీతానగరం: ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు సైట్ ఓపెన్ అయిందని, మే నెల పదో తేదీ వరకూ దరఖాస్తులు చేసుకోవచ్చని ఎంపీడీవో ఎం.భారతి తెలిపారు. ఈ మేరకు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ దరఖాస్తుదారులు ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవారై ఉండాలని, కులధ్రువీకరణ పత్రం అవసరమన్నారు. ఇదే రాష్ట్రంలో నివసించే 21 ఏళ్ల నుంచి 50 ఏళ్లలోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రవాణ రంగానికి అయితే డ్రైవింగ్ లైసెన్స్, జనరిక్ ఫార్మసీ పథకాలకు డీ ఫార్మసీ, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ చేసి ఉండాలన్నారు.

తాగునీరు అందించండి

రాజానగరం: దివాన్ చెరువులో తాగునీటి సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త డేవిడ్‌రాజు అధికారులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈని కలుసుకుని ఈ సమస్యను వివరించారు. గోదావరి నీటిని సరఫరా చేస్తూ గ్రామంలో నలువైపులా కుళాయిలను ఏర్పాటు చేయాలన్నారు.

పశువులకు నీటి తొట్టెలు నిర్మించాలి

సీతానగరం: వేసవిలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో పశువుల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్టెలు నిర్మించాలని ఎంపీడీవో ఎం.భారతి ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో సమావేశమయ్యారు. హార్టీకల్చర్ రైతులను గుర్తించి త్వరితగతిన ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. గోశాల నిర్మాణాలను పూర్తి చేయాలని, ఫారంపండ్ వర్కులను అధిక మొత్తంలో గుర్తించాలన్నారు. కూలీలకు సరాసరి సగటు వేతనం రూ.307 వచ్చేలా కొలతలు ప్రకారం పనులు చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో బీవీ సత్యవతి, ఈసీ, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పట్టా భూముల్లో అక్రమ తవ్వకాలు

సీతానగరం: మండలంలోని నల్గొండ గ్రామంలో ఎస్సీలకు ఇచ్చిన డి పట్టా భూముల్లోని అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి. దీనిపై మంగళవారం తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, ఎస్సై డి.రామ్ కుమార్‌కు సమాచారం అందడంతో వీఆర్వో, వీఆర్ఏ, కానిస్టేబుల్ ఆ ప్రాంతానికి చేరుకున్నారు. అయితే వీరు వస్తున్నట్టు సమాచారం అందుకున్న అక్రమార్కులు పొక్లెయినన్ను వేరే ప్రాంతానికి తరలించారు. తహసీల్దార్ శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ తవ్వకాలు జరిపే ప్రాంతంలో పొక్లెయిన్ లేదని, వేరే ప్రాంతంలో ఉందన్నారు. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు.

పేదలపై మరో పిడుగు!

- 27 రకాల ప్రశ్నలతో సచివాలయ ఉద్యోగుల పీ–4 సర్వే
- ఇంట్లోని వస్తువుల వివరాల నమోదు
- పథకాల కోతకేనని ప్రజల బెంబేలు



వేంద్ర గ్రామంలో పీ-4 సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

పెదపూడి: గత ఎన్నికల ప్రచార సమయంలో కూటమి నాయకులు సూపర్ సిక్స్ అంటూ ఉదరగొట్టారు. ఇంటింటికీ పోస్టర్లు పంపిణీ చేసి, మీ ఇంటికి ఈ పథకాలన్నీ వస్తాయని, ఎంతో మేలు జరుగుతుందంటూ నమ్మించారు. కూటమి అధికారంలోకి వస్తే మీ జీవితాలు మెరుగుపడతాయన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక తొమ్మిది నెలలు దాటినా పథకాలు అమలుకు నోచుకోలేదు. తాజాగా పీ–4 సర్వే పేరిట ఉన్న సంక్షేమ పథకాలను ఎత్తి వేసేందుకు పాలకులు శ్రీకారం చుట్టారు. సర్వేలో భాగంగా సచివాలయం ఉద్యోగులు ప్రజలకు ఫోన్ చేసి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. టీవీ, ఏసీ, ఫోర్ వీలర్, టూ వీలర్, ఇతర గృహోపకరణాలు, ఇంటి స్వరూపం, రేకులా, శ్లాబా, బ్యాంక్ ఖాతా ఇలా 27 రకాల ప్రశ్నలు అడిగి సమాధానాలను నమోదు చేస్తున్నారు. ఆపై ప్రజల ఫోన్‌కు వచ్చిన ఓటీపీ నమోదు చేసి ఈ తతంగాన్ని ముగిస్తున్నారు.

కలవరం

సర్వేలో సిబ్బంది పొందుపర్చే అంశాలు ప్రస్తుత జీవన శైలిలో భాగమైనవే. స్మార్ట్ ఫోన్, బైక్ ఉన్నాయా లాంటి ప్రశ్నలు ఉండటంతో సంక్షేమ పథకాల్లో కోత పడుతుందనే ఆందోళన ప్రజల్లో నెలకొంది. సర్వేకు ఎవరైనా నిరాకరిస్తే వారి పేర్లను సైతం నమోదు చేయాలనే ఆదేశాలు సిబ్బందికి జారీ చేయడం కలవరానికి గురిచేస్తోంది.

పకడ్బందీగా..

పీ 4 సర్వేను పబ్లిక్ ప్రైవేటు పార్టనర్ షిప్‌తో నిర్వహిస్తున్నారు. దీని నమ్మాలని అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో కుటుంబాలను సర్వే చేయాల్సి ఉంది. ఇంటి వద్దకు సిబ్బంది వెళ్లి వివిధ రకాల సమాచారాన్ని సేకరించి యాప్‌లో నమోదు చేస్తున్నారు. సర్వే పకడ్బందీగా నిర్వహించాలని, దీన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని చెబుతున్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల గుర్తింపు కోసం ఈ సర్వే దోహదపడుతుందనే అంశాన్ని ప్రజలకు తెలియజేయాలని క్షేత్రస్థాయి సిబ్బందికి అధికారులు చెప్పినట్లు సమాచారం. ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలు యథావిధిగా కొనసాగుతాయని దీనిలో ఎలాంటి అపోహలొద్దని చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అయోమయం నెలకొంది.

అనపర్తి నియోజకవర్గం

మండలం	రేషన్ కార్డులు
అనపర్తి	23,175
బిక్కవోలు	23,146
పెదపూడి	23,932
రంగంపేట	20,323
మొత్తం	90,576

పథకాలు ఇవ్వలేకనే..



ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలను అమలు చేయలేకనే కూటమి ప్రభుత్వం పీ–4 సర్వే అంటూ ప్రజలను మోసం చేస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇటువంటి సర్వేలు చేయలేదు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలన్ని వెంటనే అమలు చేయాలి.

– సొంబత్తుల చంటి, కాండ్రేల

సమసమాజ నిర్మాణానికి అంబేడ్కర్ కృషి



వడిశలేరులో కబడ్డీ పోటీల్లో గెలుపొందిన జట్టుకు ట్రోఫీ అందిస్తున్న డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి
- బాబా సాహెబ్‌కు ఘన నివాళి

రంగంపేట: సమసమాజ నిర్మాణానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎనలేని కృషి చేశారని వైఎస్సార్ సీపీ అనపర్తి నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. వడిశలేరులోని ఎస్సీ కాలనీలో సోమవారం రాత్రి మండల పరిధిలోని అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ పరిపాలనలో పేదల భాగస్వామ్యం ఉండాలని అంబేడ్కర్ తలచినట్లుగానే, మాజీ సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలన సాగించారన్నారు. ఆ స్ఫూర్తితోనే తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లలో సంక్షేమ పాలన అందించారన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన మెట్ల స్టాండ్‌ను ప్రారంభించారు. కబడ్డీ పోటీలలో గెలుపొందిన విజేతలకు జక్కంపూడి విజయలక్ష్మితో కలసి బహుమతులు అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొల్లాటి ఇజ్రాయేలు, మాజీ ఎంపీపీ పోతుల బులి వీర్రాజు, వైఎస్సార్ సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం చైర్మన్ కుసుమంచి కృష్ణంరాజు, వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ నలమాటి భీముడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అంబేడ్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సత్రం భూముల కౌలు రూ.5.16 లక్షలకు ఖరారు



వేలం నిర్వహిస్తున్న అధికారులు

రాజానగరం: స్థానిక రాజా కాండ్రేగుల జోగిజగన్నాథరావు బహదూర్ పంతులు అన్నదాన సత్రానికి సంబంధించిన తూర్పుగానుగూడెంలోని 25.16 ఎకరాల సాగు భూమి కౌలుకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.5.16 లక్షలకు వేలం ఖరారైంది. సత్రం ఎగ్జిక్యూటివ్ అధికారి డి.సురేష్ బాబు మాట్లాడుతూ ఐదు బిట్లుగా వేలం నిర్వహించగా నాలుగు బిట్ల (20.25 ఎకరాలు)ను గుర్రం శ్రీనివాసరావు రూ.4.26 లక్షలకు, ఒక బిట్ (4.91 ఎకరాలు)ను పిడుగు సురేష్ రూ.90 వేలకు వేలంలో పాడుకున్నారన్నారు. ఈ విధంగా మూడేళ్లకు రూ.15.48 లక్షల ఆదాయం సమకూరనుందన్నారు. దశాబ్దాల తరబడి తక్కువ శిస్తుతో ఒకే కుటుంబం చేతిలో ఉన్న ఈ భూములకు ఇంతటి ఆదాయం రావడానికి అవసరమైన చొరవ తీసుకోవడంతోపాటు గత ప్రభుత్వం చేసిన యాక్ట్ 36 కూడా ఒక కారణంగా పేర్కొన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



శిబిరంలో సేవలందిస్తున్న వైద్యుడు

పెదపూడి: వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సత్యసాయిబాబా సేవాసమితి కాకినాడ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ గోవిందరాజులు అన్నారు. పెదపూడిలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం హోమియో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యనారాయణ 126 మందికి వైద్య పరీక్షలు చేశారు. సేవా సమితి కన్వీనర్ మార్ని సత్యనారాయణ చౌదరి, సేవాదళ్ ప్రతినిధులు లొల్ల శ్రీరామ్మూర్తి, మార్ని శ్రీరాములు, ముమ్మారెడ్డి పట్టాభి రామయ్య, బొడ్డు హరికృష్ణ, నూని బాబూరావు పాల్గొన్నారు.

17న కంటి వైద్య శిబిరం

స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 17న కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని యార్లగడ్డ గోవిందరాజులు తెలిపారు. ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ వేమగిరిలోని పరమహంస యోగానంద నేత్రాలయం సిబ్బంది వైద్య సేవలు అందిస్తారన్నారు.

కాయకష్టం నేలపాలు



గాదరాడలో ఈదురుగాలులకు నేలరాలిన మామిడి కాయలు

- ఈదురుగాలులతో తీవ్ర నష్టం
- నేలరాలుతున్న మామిడి కాయలు

కోరుకొండ: మెట్ట ప్రాంతమైన కోరుకొండ మండలంలోని మామిడి కాయలకు రుచి ఎక్కువ. వీటిని కొనుగోలు చేయడానికి చాలామంది ఆసక్తి చూపుతారు. అయితే ఇటీవల వాతావరణంలో మార్పుల కారణంగా ప్రతి రోజూ సాయంత్రం ఈదురు గాలులు వీస్తున్నాయి. దీంతో మామిడి కాయలు నేలరాలుతున్నాయి. ఎదిగే దశలోని కాయలు రాలిపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. రాజానగరం నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 3,234 హెక్టార్ల విస్తీర్ణంలో మామిడి తోటలున్నాయి. ఒక్క కోరుకొండ మండలంలోనే 1,350 హెక్టార్లలో విస్తరించాయి. గత సంవత్సరం మంచి ధర పలకడంతో ఎక్కువ మంది రైతులు కౌలుకు తీసుకున్నారు. ఈదురు గాలుల కారణంగా నర్సాపురం, కణుపూరు, గాదరాడ గ్రామాల్లో ఎక్కువగా కాయలు నేలరాలిపోయాయి. దీంతో రైతులు మంచి ధర అందుకోలేక పోతున్నారు. రాలిపోయిన కాయలకు తక్కువ ధర పలకడంతో నష్టాలకు గురవుతున్నారు. ప్రస్తుతం టన్ను రూ.2,500 నుంచి రూ.5 వేలు మాత్రమే పలుకుతోంది. సాధారణంగా కాయ రకం, సైజును బట్టి రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు ఉంటుంది. కాగా.. మామిడి తోటల రైతులను మంగళవారం ఉద్యానశాఖ మండలాధికారి రినీ కలిశారు. నర్సాపురం, గాదరాడ, కణుపూరు గ్రామాల్లోని తోటలను పరిశీలించారు.

ఆడిట్ చేసినవారు అధికారులుగా రావొద్దు

- వెదుళ్లపల్లి పీఏసీఎస్ సభ్యుల డిమాండ్
- పలు అంశాలపై తీర్మానాలు



పర్సన్ ఇన్‌చార్జి కృష్ణమోహన్‌ను నిలదీస్తున్న సంఘ సభ్యులు

సీతానగరం: గతంలో సంఘ రికార్డులను ఆడిట్ చేసిన అధికారులే తిరిగి ఇప్పుడు విచారణాధికారులుగా వస్తున్నారని, వారికి బదులు కొత్త అధికారులను సంఘానికి నియమించాలని రైతులు డిమాండ్ చేశారు. వెదుళ్లపల్లి పీఏసీఎస్‌లో పర్సన్ ఇన్‌చార్జి ఎం.కృష్ణ మోహన్, 51 ఎంక్వైరీ ఆఫీసర్ శివ కుమార్, ఆడిటర్ కె.సుబ్బారావు ఆధ్వర్యంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులైన రైతులు మాట్లాడుతూ పీఏసీఎస్‌ను ఆన్‌లైన్ కంప్యూటరైజ్ చేయాలని, అలాగే జమాఖర్చులను తమకు తెలియపర్చాలని, 2018 ఏప్రిల్ నుంచి సంఘంలో ఆడిట్ చేసిన అధికారులు, దుర్వినియోగం అయిన నగదుపై విచారణాధికారులుగా రావద్దని, కొత్త వారిని నియమించాలని తీర్మానించారు. గతంలో అవినీతికి పాల్పడిన సీఈవో సురేంద్ర, గుమస్తా పోశియ్య, ఎరువుల సేల్స్ వుమెన్ భారతిలను సస్పెండ్ చేశారన్నారు. ఎరువుల అమ్మకాల్లో అవినీతికి పాల్పడిన భారతిని ఇప్పుడు ఎందుకు విధులలోని తీసుకున్నారని నిలదీశారు. దీనిపై స్పందించిన పర్సన్ ఇన్‌చార్జి.. రైతులు తమ డిమాండ్లను లిఖిత పూర్వకంగా అందజేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లతామని తెలిపారు. 2018 నుంచి ఆడిట్ చేస్తున్న మీరందరూ అవినీతి జరిగిందని ఎందుకు చెప్పలేదని కరుటూరి విశ్వనాథం, పెందుర్తి రాజా, తన్నీరు త్రిమూర్తులు, కొత్తపల్లి దోసాలరావు, రేఖపల్లి వీరభద్రరావు, పీసపాటి వెంకటరమణ తదితరులు నిలదీశారు. పర్సన్ ఇన్‌చార్జ్ కృష్ణమోహన్ మాట్లాడుతూ సంఘంలో 400 మంది సభ్యులున్నారని, వారిలో 45 మంది రైతులు తీసుకున్న రుణాల చెల్లింపులో నకిలీ రశీదులను సస్పెండైన అప్పటి సీఈవో ఇచ్చారన్నారు. మొత్తం రూ.14 లక్షలు దుర్వినియోగం అయినట్లు తేలిందని, ఇంకా విచారణకు వచ్చే నెల 12 వరకు గడువు ఉందన్నారు. గతంలో రూ.64 లక్షలు దుర్వినియోగం కాగా, తిరిగి రూ. 57 లక్షలను సస్పెండైన వారు చెల్లించారని, ఇంకా రూ.7 లక్షలు రావాల్సి ఉందన్నారు. రైతులకు అందించిన నకిలీ రసీదులపై రికార్డులను పరిశీలించగా రూ.14 లక్షలు దుర్వినియోగం అయినట్లు గుర్తించామన్నారు.

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

పెదపూడి: రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి డబుల్ ఇంజిన్ సర్కార్ పనిచేస్తోందని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. అనపర్తిలో రూ.40 లక్షలతో నిర్మించే ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో మంగళవారం శంకుస్థాపన చేశారు. లక్ష్మీనరసాపురంలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు.

బిక్కవోలు: మండలంలోని కొమరిపాలెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీ పురందేశ్వరి ప్రారంభించారు. పలు సీసీ రోడ్లకు శంకుస్థాపనలు చేశారు.

రంగంపేట: ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచిన రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులను ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అభినందించారు. ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

పెదపూడి: సంపరలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ప్రారంభోత్సవాలు చేశారు. ఆయన ఎమ్మెల్యేగా విజయం సాధించినందుకు బుల్లి బాపనమ్మ ఆలయంలో పటిక బెల్లంతో తులాభారం వేశారు.

పాస్టర్‌ది ప్రమాదం కాదని నమ్ముతున్నా..



మీడియాతో మాట్లాడుతున్న హర్షకుమార్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): పాస్టర్ ప్రవీణ్ పగడాలది ప్రమాదం కాదని తాను నమ్ముతున్నానని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. రాజమహేంద్రవరంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'నేను చాలెంజ్ చేస్తున్నాను. అదే బుల్లెట్‌తో పోలీసుల సమక్షంలో నేను వెళ్తాను. ఎలా చనిపోతానో చూస్తాను' అని అన్నారు. పోలీసుల విచారణపై ప్రెస్‌మీట్ పెట్టిన ఐజీ అశోక్ కుమార్ ఇన్వెస్టిగేషన్ అధికారి కాదని చెప్పారు. ఎస్పీ కూడా ఇన్వెస్టిగేషన్ అధికారి కాదని, మరి వారు ఏవిధంగా దర్యాప్తు చేశారని ప్రశ్నించారు. పోలీసులు విడుదల చేయకముందే సీసీ ఫుటేజ్‌లు రావడంపై అనేక అనుమానాలున్నాయన్నారు. ఆ సీసీ ఫుటేజ్‌లను పోలీసులే ప్రజలతో విడుదల చేయించారని, ప్రవీణ్ పగడాల తాగుబోతని చెప్పడానికే వీడియోలు అలా చేశారని ఆరోపించారు. ఈ వీడియోలు వాస్తవమని కూడా తాను నమ్మడం లేదన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీలో ఉన్న కొంతమంది మతోన్మాదులు ఈ దేశం నుంచి క్రైస్తవులను తరిమికొట్టాలని చూస్తున్నారన్నారు. హిందువులు మైనారిటీలైపోతారంటూ అబద్ధపు ప్రచారం చేస్తున్నారన్నారు. నిజంగా రోడ్డు ప్రమాదమే అయితే ప్రవీణ్ పగడాల ల్యాప్‌టాప్ ఇతర వస్తువులను ఎందుకు తీసుకు వెళ్లారని ప్రశ్నించారు. బ్యాంకు అకౌంట్ ఎందుకు సీజ్ చేశారో కూడా తెలియాలన్నారు. ప్రవీణ్ ప్రగడాలది ప్రమాదం కాదని, బీజేపీ, ఆర్ఎస్ఎస్ కలిసి ప్లాన్ చేశాయని ఆరోపించారు. ఐజీ అన్ని ఫుటేజ్‌లు సంపాదించి, ప్రమాదం జరిగిన చోట ఎందుకు సంపాదించలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇంకా చాలామంది పాస్టర్లను హత్య చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. లౌకికవాదులందరూ ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. రాజమహేంద్రవరంలో ఈ నెల 19వ తేదీ సాయంత్రం 5 గంటలకు కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్నామని, దీనికి అందరూ తరలి రావాలని హర్ష కుమార్ కోరారు.

ట్రాఫిక్ పోలీసులకు కళ్లజోళ్ల పంపిణీ



ట్రాఫిక్ పోలీసుకు కళ్లజోడు అందిస్తున్న ఆసుపత్రి సిబ్బంది

సీటీఆర్ఐ: ఏవీ అప్పారావు రోడ్డులోని అగర్వాల్ హాస్పిటల్‌లో మంగళవారం సుమారు 300 మంది ట్రాఫిక్ పోలీసులకు చలువ కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ నరసింహ కిశోర్ మాట్లాడుతూ నిత్యం ఎండలో నిలబడుతూ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులకు డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి కూలింగ్ కళ్లజోళ్లను అందించడం అభినందనీయమన్నారు. వారి సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సత్తి విజయ్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సత్తి విజయ, డాక్టర్ వర ప్రసాద్ కార్యంశెట్టి, జయకుమార్ రెడ్డి(రీజినల్ మేనేజర్, కార్పొరేట్ రిలేషన్స్ ఏపీ), అఖిల్ (క్లస్టర్ మేనేజర్ ఆపరేషన్స్) తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అంతర్జాతీయ సదస్సు



సదస్సులో సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

రాజానగరం: ఇంజినీరింగ్, వైద్యశాస్త్రాలలో జరిగిన పురోగతిపై తూర్పుగానుగూడెంలోని ఐఎస్‌టీఎస్ వుమెన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో రెండు రోజుల పాటు జరిగిన అంతర్జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. యెమెన్‌లోని హెబ్రీ యూనివర్సిటీ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్, సమర్కండ్ స్టేట్ యూనివర్సిటీ (ఉజికిస్తాన్), సొసైటీ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఎక్స్పెర్ట్ ఇండియా, ఓఎస్ఐఈటీ సహకారంతో ఈ సదస్సు నిర్వహించారు. దీనిలో ఇంజినీరింగ్, వైద్య రంగాలకు సంబంధించి 66 పరిశోధన పత్రాలను సమర్పించారని కళాశాల వైస్ చైర్మన్ వి.అనూషా రెడ్డి తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వై.రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డాక్టర్ రాయి ప్రసాద్ కన్వీనర్‌గా వ్యవహరించారు.

దైవనామ స్మరణతో జీవితం చరితార్థం

రంగంపేట: కలియుగంలో దైవనామ స్మరణకు మించిన ఆధ్యాత్మిక సాధన మరొకటి లేదని, ప్రతి ఒక్కరూ తమ ఇష్ట దైవాన్ని నిరంతరం స్మరించుకుని జీవితాన్ని చరితార్థం చేసుకోవాలని విజయవాడ చైతన్య కళాశాల సంస్కృతోపన్యాసికులు కందర్ప రాంబాబు మాస్టారు పిలుపు నిచ్చారు. కోటపాడు సత్యసాయి సేవాసదన్‌లో సేవాసమితి కన్వీనర్ కందర్ప వెంకట అమరనాథ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ఆధ్యాత్మిక సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సత్యసాయి సందేశాలు ఆచరణాత్మక సూత్రాలని, ప్రతి రోజూ కొంత సమయాన్ని సాయి సాహిత్య పఠనానికి, లిఖిత నామ జపానికి కేటాయించాలన్నారు. సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలలో భాగంగా నిర్వహించే ప్రతి ఆధ్యాత్మిక, విద్య, సేవా కార్యక్రమాలలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరానికి చెందిన విభూతి వైష్ణవ్ ఆలపించిన సాయి సంగీతార్చన అలరించింది. కార్యక్రమంలో సేవాదళ్ సభ్యులు, బాల వికాస్ విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నలుగురు యువకుల అరెస్ట్

సీతానగరం: సామాజిక మాధ్యమాల్లో పోస్టింగ్‌తో జరిగిన ఘర్షణకు సంబంధించి రాపాక గ్రామానికి చెందిన నలుగురు యువకులను అరెస్ట్ చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ మంగళవారం తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో సోమవారం పెట్టిన పోస్టింగ్‌తో లంకూరు, రాపాక యువకుల మధ్య ఘర్షణ జరిగిందన్నారు. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలై రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రాపాకకు చెందిన తాడిమల్ల మాధవ్, ఎలిపే మదన్, సబ్బితి అఖి, సబ్బితి మనోజ్ కుమార్‌లను అరెస్ట్ చేశామన్నారు. చికిత్స పొందుతున్న ఒకరు, బాలుడిపై చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు.

ప్రవేశ పరీక్షలకు ఆర్ట్స్ కళాశాలలో ఉచిత శిక్షణ

కంబాలచెరువు: ఏపీ పీజీ సెట్, ఐసెట్ తదితర ప్రవేశ పరీక్షలకు ఆర్ట్స్ కళాశాలలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్కే తెలిపారు. ఈ మేరకు మంగళవారం కోచింగ్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డిగ్రీ ఫైనల్ ఇయర్ పూర్తయ్యాక విద్యార్థులు పీజీ కోర్సుల్లో చేరేందుకు ఉత్సాహం చూపిస్తున్నారన్నారు. అలాంటి వారికి తమ కళాశాల తరఫున శిక్షణ ఇస్తామన్నారు. ఇది ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ మోడ్‌లలో అందుబాటులో ఉంటుందని, రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. పీజీ కోచింగ్ కో ఆర్డినేటర్ డాక్టర్ బి.మల్లికార్జున్ మాట్లాడుతూ కోచింగ్‌కు సంబంధించిన పూర్తి వివరాలు బ్రోచర్‌లో పొందుపరిచామని, అలాగే కళాశాల అధికారిక వెబ్‌సైట్ 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జీసిఆర్‌జేవై.ఎసి.ఇన్‌ను సందర్శించాలని సూచించారు.

గుర్తు తెలియని మహిళ మృతి

రాజమహేంద్రవరం రూరల్: దివాన్ చెరువు పంచాయతీ పరిధిలోని శ్రీరామపురం ప్రాంతంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం గుర్తించినట్టు ఆ గ్రామ వీఆర్వో దారా రామజోగి మంగళవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్, సిబ్బంది ఆ మృతదేహాన్ని పరిశీలించారు. ఆమె వయసు సుమారు 30 నుంచి 35 ఏళ్లు ఉంటుందని, సుమారు 20 రోజుల క్రితం మృతి చెందిఉంటుందని భావిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96533, 94911 22811 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్ కోరారు.

21 నుంచి స్లాట్ బుకింగ్ విధానం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ నెల 21 నుంచి స్లాట్ బుకింగ్ విధానం ప్రవేశపెడుతున్న కాకినాడ రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖ డీఐజీ(ఎఫ్ఏసీ) డాక్టర్ ఎల్.వెంకటేశ్వర్లు అన్నారు. ఆ విధానంపై మంగళవారం సాయంత్రం రాజమండ్రి రిజిస్ట్రార్ కార్యాలయం(ఓబీ)లో సబ్ రిజిస్ట్రార్లకు జిల్లా రిజిస్ట్రార్ ఆర్.సత్యనారాయణ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాజమండ్రి జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1, 2 రాయి రాంబాబు, కె.పుల్లంరాజు మాట్లాడుతూ స్లాట్ విధానంపై అవగాహన కల్పించారు.